
ఆంధ్రజ్యోతి



నిర్లక్ష్యపు నీడలో
చారిత్రక కట్టడాలు
ప్రాభవం కోల్పోతున్న కాకతీయుల కట్టడాలు
వెల్లుర్లో ధ్వంసమవుతున్న శిల్పసంపద 7



వనదుర్గమ్మకు నీరాజనం

పాపన్నపేట, జూన్ 15(ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఆదివారం వారాంతపు సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు నిజామాబాద్, కరీంనగర్, జంట నగరాలు, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వాతావరణం చల్లగా ఉండడంతో పచ్చని చెట్లు, మంజీర పాయల్లో భక్తులు సందడి చేశారు. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి భక్తులు బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.



రైతు సాగు బాట

ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే ప్రవేశించడంతో అన్నదాత పొలం బాట పట్టాడు. ఏరువాక పౌర్ణమి ముగియడం, వాతావరణం కూడా చల్లబడడంతో సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కొంతమంది రైతులు ఇప్పటికే పత్తి విత్తనాలు నాటగా, ప్రస్తుతం మొలకెత్తడంతో ఎడ్లతో దుక్కులు చేస్తున్నారు. ఝరాసంగం మండల పరిధిలో మహిళ కూలీలు ఓవైపు సోయా విత్తనాలు వేస్తుంటే మరోవైపు ఎడ్లతో రైతులు అడుగు మందులను వేస్తున్నారు. -ఝరాసంగం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి)



ఫర్టిలైజర్ దందాపై కలెక్టర్ సీరియస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంగ్టి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): 'ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు' శీర్షికన ఈ నెల 14న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో జరుగుతున్న అక్రమ దందాపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వ తేదీ వరకు మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో విక్రయించిన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన బిల్లు బుక్కులు, రసీదులను పరిశీలించాలని ఆమె వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఎరువులు, విత్తనాలను పక్క రాష్ట్రాలకు తరలిస్తే డీలర్ల అనుమతులను రద్దు చేస్తామని ఆమె తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది.

సైబర్ క్రైమ్ రీఫండ్‌లో సంగారెడ్డికి జిల్లాకు ఐదో స్థానం

సంగారెడ్డి క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్‌లో సైబర్ క్రైమ్ రీఫండ్‌లో సంగారెడ్డి జిల్లాకు రాష్ట్రస్థాయిలో 5వ స్థానం దక్కిందని ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 2287 కేసులను పరిష్కరించి, ఇరువర్గాలకు రాజీ కుదిర్చినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం రూ.1.43 కోట్లు బాధితులకు ఇప్పించామని పేర్కొన్నారు.



ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఫస్టియర్ విద్యార్థి ఫీజు రూ.20,000, సెకండియర్ ఫీజు రూ.25,000 వరకు ఉంది. అదే ప్రైవేటు స్కూళ్లల్లో ఎల్‌కేజీ చదువుతున్న విద్యార్థికి ఫీజు ఎంత వసూలు చేస్తున్నారో తెలుసా? అక్షరాల ఇరవై రెండు వేలు. ఇంతేనా పుస్తకాలు, యూనిఫాం అంటూ అదనపు ఖర్చు. అంటే ఇంటర్మీడియట్ కంటే ఎల్‌కేజీ చదువు మరింత కాస్ట్‌లీ అన్నమాట. ఏడాదికేడాదికి తల్లిదండ్రులకు ఈ ఫీజుల భారం పెరుగుతూనే ఉంది. ఎక్కడా ప్రభుత్వ నియంత్రణ కనిపించడం లేదు.

ఫీజులుం

ప్రైవేటు స్కూళ్లలో ఇష్టానుసారంగా ఫీజుల వసూలు

వసతులు లేకున్నా వేలల్లో దండుకుంటున్నారు

తల్లిదండ్రులకు భారమవుతున్న పిల్లల చదువులు

ఫీజుల నియంత్రణ జీవో 91 అమలేదీ?

మెదక్ అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మళ్లీ ఫీజుల మోత మోగిస్తున్నాయి. ఇష్టానుసారంగా ఫీజులను పెంచుతుండటంతో సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులు ఆర్థిక భారంతో సతమతమవుతున్నారు. ఫీజుల నియంత్రణకు చాన్నాళ్ల క్రితం ప్రభుత్వం జీవో 91 జారీ చేయగా, అదీ ఎక్కడా అమలవుతున్నట్లు కనిపించడం లేదు.

జీవో 91పై కొరవడిన నియంత్రణ

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వం జీవో 91ని జారీ చేసింది. దీని ప్రకారం గ్రామీణ ప్రాంతాలకు రూ. 8,000 పట్టణ ప్రాంతాలకు రూ.12,000 ఫీజులుగా నిర్ణయించింది. కానీ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ నిబంధనలను బేఖాతరు చేస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఫీజులు మరింత పెరిగాయి.

తల్లిదండ్రులకు తడిసిమోపెడు

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య ఉన్నప్పటికీ, పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమం లేకపోవడంతో అధిక ఫీజులు చెల్లించైనా తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. ఇది ప్రైవేటు యాజమాన్యాలకు కాసులు కురిపిస్తోంది. ప్రైమరీ స్కూల్‌కే ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతోంది. ఎల్‌కేజీకే రూ.22,000తో ప్రారంభమై, తరగతి పెరిగే కొద్దీ ఫీజులు పెరుగుతున్నాయి. 5వ తరగతికే రూ.30,000 వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇంతేనా పేరున్న స్కూళ్లలో అడ్మిషన్ కోసం డొనేషన్లను వసూలు చేస్తున్నారు. దీనికి తోడు పుస్తకాలు, యూనిఫాం, షూస్, టై, బెల్ట్, బస్సు ఛార్జీలు, పరీక్ష ఫీజులు, వార్షిక ఫీజులు వంటి అదనపు ఖర్చులు కలుపుకుంటే నెలకు వేలల్లో ఖర్చవుతోంది. ఇంతే కాకుండా పుస్తకాల భారం కూడా తల్లిదండ్రులపైనే పడుతోంది. పుస్తకం ప్రింటింగ్ ధర రూ.200 ఉంటే దాన్ని విక్రయించే పాఠశాలకు సగం ధరకే వస్తుంది. కానీ రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ఇలా మొత్తం పుస్తకాలను రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు. చిన్నపాటి

ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు (దాదాపుగా)

తరగతి	ఫీజు (రూ.)
ఎల్‌కేజీ	22,000
యూకేజీ	23,000
1వ	24,000
2వ	25,000
3వ	26,000
4వ	28,000
5వ	30,000

మిగతా 8వ పేజీలో

పారిశ్రామికవాడలో ఆధునిక పోలీస్ స్టేషన్లు

సైబర్ నేరాల నియంత్రణే లక్ష్యం

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ఐడీఏ బొల్లారంలో పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎస్పీ

ఐడీఏ బొల్లారం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న సైబర్ నేరాలను సమర్థంగా గుర్తించి, నియంత్రించేందుకు నియోజకవర్గంలో ఐదు ఆధునిక పోలీస్ స్టేషన్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఐడీఏ బొల్లారం పురపాలక పట్టణంలో నూతన పోలీస్‌స్టేషన్ భవనానికి శంకుస్థాపన నిర్వహించారు. హెట్రో ల్యాబ్స్ పరిశ్రమ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద రూ.3.5 కోట్ల అంచనా వ్యయంతో ఈ నిర్మాణ పనులను చేపడుతోంది. ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఐజీ సత్యనారాయణ, ఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ ప్రభాకర్, హెట్రో ల్యాబ్స్ డైరెక్టర్ మోహన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ, హెట్రో పరిశ్రమ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద మొత్తం రూ.6 కోట్లు ఇస్తోందని, మరో రూ.2.5 కోట్లతో గుమ్మడిదల మండల పోలీస్‌స్టేషన్ పనులు చేపడతామని వివరించారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్, కొల్లూరు పోలీస్ స్టేషన్లను కూడా నూతన భవనాలను నిర్మించనున్నామని చెప్పారు. పరిశ్రమల యజమానులు సహకరించేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు.



మెదక్‌లో నిలిచిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం

'డబుల్' గతేంటి?

మెదక్ జిల్లాలో నిరుపయోగంగా ఇళ్లు

పూర్తయినా కేటాయించని వైనం.. కొన్ని శిథిలావస్థకు

మరికొన్ని చేతులు మారుతున్న వైనం

మెదక్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిన నేపథ్యంలో, గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మెదక్ జిల్లాలో వందల కోట్లు వెచ్చించి నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొన్నింటి నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు కేటాయించకపోవడం, మరికొన్ని అసంపూర్తిగా వదిలేయడం వంటి కారణాలతో ఇళ్లు నిరుపయోగంగా మారాయి.

డబుల్ బెడ్రూం ఇళ్ల దుస్థితి

జిల్లావ్యాప్తంగా మొత్తం 4,776 డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరవగా, వీటిలో 3,996 ఇళ్లకు సాంకేతిక అనుమతులు లభించగా, 3,796 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది. ఇప్పటివరకు 2,759 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇంకా 1,037 ఇళ్ల నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయాయి. 179 ఇళ్ల పనులు అసలు ప్రారంభమే కాలేదు. పూర్తయిన ఇళ్లు కూడా లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో పాడుబడ్డ స్థితికి చేరుకున్నాయి.

జిల్లాలో డబుల్ ఇళ్ల వివరాలు

మెదక్ నియోజకవర్గం	2,200
నర్సాపూర్ నియోజకవర్గం	1,275
చేగుంట, నార్సింగి మండలాలు	452
పెద్దశంకరంపేట మండలం	140
తూప్రాన్, మనోహరాబాద్ మండలాలు	709

ఇళ్ల సమస్యలు

శిథిలావస్థ : వర్షాలకు గోడలకు పగుళ్లు రావడం, విద్యుత్ మీటర్లు ఊడిపోవడం, కిటికీ అద్దాలు పగిలిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అనేక చోట్ల పిచ్చి మొక్కలు పెరిగి నివాసయోగ్యం లేకుండా పోతున్నాయి.

అసంపూర్తి నిర్మాణాలు: కాంట్రాక్టర్లకు బిల్లులు అందకపోవడంతో దాదాపు 70 శాతం పనులు పూర్తైన చోట్ల మిగిలిన పనులు నిలిచిపోయాయి. ఈ నిర్మాణాలు ఫెన్సింగ్ లేకుండా వదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి.

కనీస సౌకర్యాల కొరత: జిల్లా కేంద్రమైన మెదక్‌లో నిర్మించిన కాలనీలో రోడ్లు లేకపోవడంతో వానాకాలంలో

మిగతా 8లో

మతిస్థిమితం లేని తల్లి.. చిన్నారి మృతదేహాన్ని వదిలేసింది!

- తాగుడుకు బానిసైన భర్త
- సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు ఛేదించిన పోలీసులు
- దంపతులకు కౌన్సెలింగ్

సంగారెడ్డి క్రైం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట శనివారం లభించిన రెండు నెలల ఆడశిశువు మృతదేహం కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సీఐ రమేష్ తెలిపారు.. జహీరాబాద్ మండలం హద్నూర గ్రామానికి చెందిన రాజు కూలి పని చేస్తుంటాడు. అతడికి గౌరీ(28)తో వివాహం జరిగింది. వీరికి ఇటీవల ఒక ఆడశిశువు జన్మించింది. అయితే, గౌరీ మానసిక స్థితి సరిగ్గా లేకపోవడం కారణంగా రాజు తాగుడుకు బానిస అయ్యాడు. గౌరీ పుట్టిన బిడ్డను పట్టుకొని జహీరాబాద్ బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో తిరుగుతూ అప్పుడప్పుడు ఇంటికి వెళ్లేది. అయితే, శనివారం ఆమె బిడ్డ చనిపోవడంతో, ఏం చేయాలో తెలియక స్థితిలో గౌరీ జహీరాబాద్ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద దిగింది. అనంతరం, ఆసుపత్రి గేటు ముందు మృతిచెందిన తన శిశువును వదిలేసి వెళ్లిపోయింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసును ఛేదించిన పోలీసులు, బిడ్డ తల్లి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఆమెను జహీరాబాద్ పట్టణ పోలీసులకు అప్పగించారు. ప్రస్తుతం గౌరీకి చికిత్సతో పాటు, భార్యాభర్తలు ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సంగారెడ్డి మెడికల్ కళాశాలకు షోకాజ్ నోటీసులు

ఎన్ఎంసీ పరిశీలనలో పలు లోపాలు గుర్తింపు

- 18న వర్చువల్‌గా వివరణ ఇవ్వనున్న ప్రిన్సిపాల్

సంగారెడ్డి అర్బన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు(జీఎంసీ) నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రధానంగా అధ్యాపకుల కొరత, హాస్టల్ వసతి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడడం, వైద్య విద్య తరగతుల నిర్వహణకు సరిపడా గదులు, ల్యాబ్‌లు లేకపోవడం తదితర కారణాలతో ఎన్ఎంసీ తాజాగా నోటీసులను జారీ చేసింది. అయితే, గతేడాది ఎన్ఎంసీ వర్చువల్‌గా జరిపిన పరిశీలనలో పక్కా హాస్టల్ భవనాలు సిద్ధం కాకపోవడం, ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇతర టీచింగ్ ఫ్యాకల్టీ కొరత, థియరీ, ప్రాక్టికల్స్‌కు సరిపడా తరగతి గదుల లేకపోవడం తదితర సౌకర్యాల లేమిని గుర్తించి నోటీసులు జారీ చేసినట్టు కళాశాల అధికార వర్గాలు తెలిపాయి. 2022లో ప్రారంభమైన ఈ కళాశాలలో ప్రస్తుతం 450 మంది విద్యార్థులతో మూడో వైద్య విద్యా సంవత్సరం కొనసాగుతున్న విషయం తెలిసిందే.

ఎన్ఎంసీకి ప్రిన్సిపాల్ నివేదిక

వైద్య విద్యార్థులకు సంబంధించిన పక్కా హాస్టల్ భవనాలు సిద్ధమయ్యాయి. బాలురు, బాలికలకు వేర్వేరు హాస్టల్ భవనాలు భవనాలు కేటాయించారు. 2వ తేదీ నుంచే మెడికోలు కొత్త హాస్టల్ భవనాల్లోనే వసతి ఉంటున్నారు. ఇక థియరీ, ల్యాబ్ ప్రాక్టికల్ నిర్వహణకు కూడా మరో భవనం సిద్ధంగా ఉన్నది. ఇక అధ్యాపకులు కొరత నేపథ్యంలో వెంటనే నియామకాలు జరపాలంటూ ఇప్పటికే కళాశాల ప్రిన్సిపాల్ డీఎంఈకి లేఖ రాశారు. ఎన్ఎంసీ జారీ చేసి షోకాజ్ నోటీసులో భాగంగా ఒక్క అధ్యాపకుల నియామకాలు తప్పా మిగతా సమస్యలన్నీ పరిష్కరించబడ్డాయి. ఈ విషయాలను ఈ నెల 18న ఢిల్లీ నుంచి ఎన్ఎంసీ వర్చువల్‌గా తీసుకునే సమావేశంలో జీఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ నివేదించనున్నారు.



ఖాజాపూర్‌లో తాగునీటికి తిప్పలు

సిర్గాపూర్/కల్హేర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండలం ఖాజాపూర్‌లో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు సరిపోకపోవడంతో సగం గ్రామస్థులు ఒకే బోరు మోటారు దగ్గర కుస్తీలు పట్టుకుంటూ నీరు తీసుకువెళ్తున్నారు. ఇప్పటికైనా నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

● తప్పిన పెను ప్రమాదం

కొండపాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును కొమురవెల్లి కమాన్ వద్ద రాజీవ్ రహదారిపై ఆగి ఉండగా లారీ ఢీకొట్టిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో లారీ క్లీనర్‌కు గాయాలు కాగా, బస్సు ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళ్తూ ప్రయాణికులను దించేందుకు కొమురవెల్లి కమాన్ వద్ద ఆగింది. అదే వైపు నుంచి అతి వేగంగా వస్తున్న లారీ బస్సు వెనుక వైపును ఢీకొట్టింది. లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. క్లీనర్ అందులోనే ఇరుక్కుపోయాడు. బస్సులోని ప్రయాణికులు దిగడం కోసం బస్సు ముందు వైపుకు రావడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ సంఘటనతో రహదారిపై వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికులతో కలిసి పోలీసులు, టోల్ ప్లాజా సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు జరపడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది. సుమారు అరగంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. లారీ క్లీనర్‌కు గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెక్కుచెదరని ఆనవాళ్లు..!

● సింగూరు ప్రాజెక్టులో ముంపు జ్ఞాపకాల్లో ఆలయాలు, దర్గాలు

● పరిహారం కోసం కోర్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న 72 గ్రామాల బాధితులు

మునిపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టు నిర్మాణం 1979లో ప్రారంభమై 1989లో పూర్తయింది. ఈ మధ్య కాలంలో ప్రాజెక్టు కారణంగా విడతలవారీగా జిల్లావ్యాప్తంగా 72 గ్రామాలు, 37,478 ఎకరాల భూమి ముంపునకు గురైంది. వేలాది మంది రైతులు, గ్రామస్థులు తమ కన్న ఊళ్లను వదిలి వెళ్లక తప్పలేదు. అధికారులు ముంపు గ్రామాలకు సమీపంలోనే కొత్త ఇళ్ల స్థలాలను గుర్తించి నిర్మించి ఇచ్చారు.

మునిపల్లి, రాయికోడ్, పుల్కల్, న్యాల్కల్, మనూర్, రేగోడ్, వట్‌పల్లి వంటి మండలాల పరిధిలోని సుమారు 49 గ్రామాలు పూర్తిగా ముంపునకు గురికాగా, 23 గ్రామాలు పాక్షికంగా మునిగిపోయాయి. 42 వేల మంది రైతులకు చెందిన నుంచి 37,478 ఎకరాల భూమి ప్రాజెక్టులో ముగినిగింది. అప్పట్లో ఎకరాకు సుమారు రూ.17 వేల చొప్పున పరిహారం చెల్లించారు. అయితే, ఇప్పటికీ కొన్ని గ్రామాలకు రెండు పర్యాయాలు పరిహారం అందినపప్పటికీ, మరికొన్ని గ్రామాలకు సంబంధించిన కేసులు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ముంపు బాధితులు తమ పరిహారం కోసం ఇంకా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అందోల్ ఎమ్మెల్యే, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ తీసుకుని పరిహారం అందేలా కృషి చేయాలని బాధితులు కోరుతున్నారు.



పాత మల్లికార్జున్‌పల్లిలో పురాతన ఇల్లు



అల్లాపూర్‌లో తాత-అవ్వ దర్గా

బయటపడుతున్న చరిత్ర!

ఎండాకాలంలో సింగూరు ప్రాజెక్టు నీటి మట్టం తగ్గినప్పుడు మునిగిపోయిన గ్రామాలకు సంబంధించిన అనేక ఆనవాళ్లు బయటపడుతుంటాయి. పొలాల్లోని సారవంతమైన నల్లరేగడి భూములు కనిపించడంతో రైతులు గతంలో పండించిన దిగుబడులను గుర్తుచేసుకుంటారు. కొన్ని గ్రామాల్లో ముంపునకు గురైన భూములు తేలినప్పుడు, రైతులు వాటిలో వివిధ పంటలను వేస్తూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటారు. అయితే, ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, అది నిండినప్పుడు ఈ భూములు మళ్లీ నీటిలో మునిగిపోతుంటాయి. ప్రాజెక్టు నిర్మాణంలో విలువైన భూములు కోల్పోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పవచ్చు.

చెక్కుచెదరని ఆలయాలు, దర్గాలు

మునిపల్లి మండలంలోని మల్లికార్జునపల్లి, అల్లాపూర్, తక్కడపల్లి, మల్లారెడ్డిపేట, బుసారెడ్డిపల్లి, బోడపల్లి, పిల్లోడి, గార్లపల్లి, మక్తక్యాసారం, కల్లపల్లి-బేలూర్ వంటి గ్రామాలు పూర్తిగా సింగూరు ప్రాజెక్టులో మునిగిపోయినప్పటికీ, ఆయా గ్రామాల్లోని పాత దేవాలయాలు, దర్గాలు ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇవి భక్తులకు నిత్యం దర్శనమిస్తూ పూజలు, ప్రార్థనలు అందుకుంటున్నాయి.

● మల్లికార్జునపల్లిలోని అతి పురాతన సిద్దేశ్వర దేవాలయం, పాత ఇళ్లు, బురుజు, తక్కడపల్లిలోని హనుమాన్ దేవాలయం, అల్లాపూర్‌లోని తాతా-అవ్వ దర్గా ఇప్పటికీ భక్తులను ఆకర్షిస్తున్నాయి. ఈ పురాతన కట్టడాలను చూసినవారు మట్టితో కట్టినప్పటికీ ఎంత గట్టిగా ఉన్నాయో.. అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

● గతంలో సిద్దేశ్వర ఆలయంలో గుర్తుతెలియని దొంగలు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ ఘటన అప్పట్లో పెద్ద సంచలనంగా మారింది. ఆ తర్వాత మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన గడీల నవాజ్ రెడ్డి గ్రామ పెద్దలతో కలిసి ఆలయాన్ని పునఃప్రారంభించాలని నిర్ణయించారు. దీంతో 13 జూన్ 2022న ఆలయాన్ని పునఃప్రారంభించి గత వైభవాన్ని తిరిగి తీసుకొచ్చారు. అప్పటినుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయానికి వెళ్లినప్పుడు పాత ఊరి జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నారు.



పురాతన బురుజు



ఏళ్ల నాటి అమ్మవారి శిల్పం

నిత్యం పూజలు చేస్తున్నా..



మండలంలోని పాత మల్లికార్జునపల్లి గ్రామంలోని అతి పురాతనమైన సిద్దేశ్వర స్వామి ఆలయంలో పునఃప్రారంభించినప్పటి నుంచి నిత్యం పూజలు చేస్తున్నాను. వందల ఏళ్ల నాటి పురాతన దేవాలయం అయినప్పటికీ, గ్రామ పెద్దలు గడీల నవాజ్ రెడ్డితో పాటు గ్రామస్థులు, దాతల సహకారంతో శిథిలావస్థకు చేరిన దేవాలయాన్ని పునఃప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులు తాగునీటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో పురాతన చేతి పంపు బోరును పునరుద్ధరించి మంచి నీటిని అందిస్తున్నాం. భక్తులు అన్నదాన వితరణ కూడా చేస్తున్నాం.

-నాని స్వామి, సిద్దేశ్వర ఆలయ పూజారి, మల్లికార్జునపల్లి



అల్లాపూర్‌లో చెక్కు చెదరని అప్పటి పాఠశాల

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



శ్రీను(ఫైల్)

జోగిపేట రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగిపేట బుడగజంగం కాలనీకి చెందిన ఈత శ్రీను(21) మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి కొత్త బట్టల కోసం ఇంట్లో డబ్బులు అడగగా, కుటుంబ సభ్యులు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన శ్రీను రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి, ఇందిరానగర్ కాలనీ వెనుక ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి మామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, డబ్బుల కోసం చోరీలు చేస్తూ జల్సాలకు అలవాటు పడిన శ్రీను పలు కేసుల్లో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్నాడని, తరచూ కేసులకు హాజరై కోర్టుల చుట్టూ తిరగలేకపోతున్నానని తమతో చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

మద్దూరు, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండల కేంద్రంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ వ్యక్తి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం, మద్దూరు గ్రామానికి చెందిన ఎండీ జిలానీ కుటుంబం జీవనోపాధి కోసం హైదరాబాద్ వలస వెళ్లారు. షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు వెంటనే స్థానిక ఎస్‌ఐకి సమాచారం అందించారు. ఆయన హుస్నాబాద్‌లోని ఫైర్ ఇంజన్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే చేరుకున్న ఫైర్ ఇంజన్ అధికారులు ఎస్‌ఎఫ్‌వో రాజయ్య, ఏఎల్‌ఎఫ్ మల్లికార్జున్, డీవోపీ శ్రీకాంత్, హోంగార్డ్స్ సిబ్బందితో కలిసి మంటలను ఆర్పివేశారు. ఆస్తి నష్టం వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని, కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రాణం తీసిన డ్రైవింగ్ సరదా

● ట్రాక్టర్ కిందపడి బాలుడి మృతి



మృత దేహం వద్ద బోరుమంటున్న కుటుంబీకులు

నర్సాపూర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సరదాగా కాసేపు ట్రాక్టర్ నడుపుతానంటూ తీసుకున్న 15 ఏళ్ల బాలుడికి అదే ట్రాక్టర్ కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాదకర ఘటన నర్సాపూర్ మండలం నారాయణపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపూర్‌కు చెందిన పిచ్చకుంట్ల లక్ష్మి, రాజు దంపతుల రెండో కుమారుడు వినయ్ 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం తమ సొంత ట్రాక్టర్‌తో పొలంలో మట్టిని చదును చేయడానికి కుటుంబ సభ్యులు వెళ్లారు. వినయ్ తర్వాత బర్రెలను తీసుకుని పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో తాను ట్రాక్టర్ కాసేపు నడుపుతానంటూ తీసుకుని నడుపుతుండగా, పొలంలో ఎత్తుగడ్డపై అదుపుతప్పి కింద పడ్డాడు. అదే సమయంలో వెనక ఉన్న ట్రాలీ అతడిపై పడటంతో అక్కడికక్కడే చనిపోయాడు. అదే ట్రాక్టర్‌పై ఉన్న ఇద్దరిలో ఒకరికి గాయాలు కాగా, మరొకరికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నర్సాపూర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సరదాగా ట్రాక్టర్ నడిపి ప్రమాదంలో మరణించి వినయ్ తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

● యువకుడికి తీవ్ర గాయాలు

మనోహరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం 44వ జాతీయ రహదారిపై జీడిపల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొన్నది. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా రాజిపల్లికి చెందిన విఠల్ మెదక్ నుంచి బైక్‌పై హైదరాబాద్ వెళ్తుండగా, జీడిపల్లి జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విఠల్ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారి సహాయంతో అతడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రోడ్డు ప్రమాదం పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ విషయంపై పోలీసులను అడగగా, వారికి ఎలాంటి సమాచారం లేదని, రోడ్డు ప్రమాదం జరిగిన విషయం వాస్తవమే అని మాత్రమే తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

● రాష్ట్ర ఆయిల్‌పామ్ టెక్నికల్ అడ్వైజర్ రంగనాయకులు



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న రంగనాయకులు

వెల్దుర్తి, జూన్15(ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగుతో రైతు సంపాదన స్థాయిని పెంచుతుందని రాష్ట్ర ఆయిల్ పామ్ టెక్నికల్ అడ్వైజర్ వైఎస్ రంగనాయకులు అన్నారు. మండల కేంద్రమైన వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని ఎల్కపల్లి గ్రామంలో రైతు సత్యనారాయణగౌడ్‌కు చెందిన ఆయిల్ పామ్ తోటను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్రంలో లక్షా 2 వేల ఎకరాల్లో సాగవుతుందన్నారు. ఆయిల్‌పామ్ 40 ఏళ్ల పాటు దిగుబడి ఇస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా 259 లక్షల టన్నుల ఆయిల్ పామ్ వినియోగిస్తుంటే.. కేవలం 97 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగుకు అత్యధికంగా సబ్సిడీ అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా మేనేజర్ కృష్ణారావు, డిప్యూటీ మేనేజర్ అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఐఐటీహెచ్‌లో ముగిసిన అంతర్జాతీయ యువ శాస్త్రవేత్తల సదస్సు

● ఆటోమోటివ్ సంస్థతో టీహన్ ఒప్పందం



సదస్సులో పాల్గొన్న దేశ, విదేశీ శాస్త్రవేత్తలు

కంది, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో ఈ నెల 10 నుంచి జరుగుతున్న అంతర్జాతీయ యువ శాస్త్రవేత్తల సదస్సు ఆదివారం ముగిసింది. 60 దేశాలకు చెందిన 135 మంది యువ శాస్త్రవేత్తలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ పురాతన తత్వవేత్తల సహకారాలతోనే నేటి టెక్నాలజీ అభివృద్ధి చెందిందన్నారు. అంతరిక్ష మిషన్లు, ఆహార భద్రత, ఆటోమేషన్, రోబోటిక్స్, బిగ్ డేటాలో మైలురాళ్ల ద్వారా దేశం యొక్క అద్భుతమైన పురోగతి సాధించిందని తెలిపారు. ఈ సదస్సులో ఇండియన్ నేషనల్ సైన్స్‌అకాడమీ అధ్యక్షుడు పద్మశ్రీ ప్రొఫెసర్ అశుతోష్ శర్మ, ఐఐటీ హైదరాబాద్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీ.వీ.ఆర్.మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, స్వయం ప్రతిపత్త ఆటోమోటివ్ టెక్నాలజీలలో సహకరించడానికి ఆదివారం ఐఐటీహెచ్ టీహన్(టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ అటానమస్ నావిగేషన్)తో ఒప్పందం చేసుకున్నది. ఈ సంతర్భంగా ఐఐటీహెచ్ టీహన్ అధిపతి ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి, ఆటోమోటివ్ సంస్థ ప్రతినిధులు ఎంఓయూపై సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను మర్చుకున్నారు

ఘనంగా లలితా పరమేశ్వరీ ఆలయ వార్షికోత్సవం

తూప్రాన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి వెంకటాపూర్ (పీటీ) శివారులోని శ్రీలలితా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం సప్తమ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, దేవీ ఉపాసకులు, సహస్రాధిక చండీయాగ నిర్వాహకులు సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి మహాపూజ, మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, 1216వ చండీయాగం నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో జన్మించిన చిన్నారులకు రవీంద్రశర్మ ఆధ్వర్యంలో తులాభారం చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న లలితాపరమేశ్వరీ మాత



హోమంలో పాల్గొన్న భక్తులు





ఇస్రోలో శిక్షణకు హాజరైన విద్యార్థులు

ఫలితాల్లో అమోఘం.. ప్రతిభలో ఆదర్శం

● అన్నింట్లో రాణిస్తున్న లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు
● యువికా(యువ విజ్ఞాని కార్యక్రమం)లో సత్తా
● హైడ్రోజన్ రాకెట్ ప్రయోగంతో జాతీయ స్థాయి గుర్తింపు
● వ్యర్థాలతో సంపద, విద్యుత్ తయారీ

దుబ్బాక, జూన్15(ఆంధ్రజ్యోతి) : దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు చదువుతో పాటు పరిశోధన, కళలు, క్రీడలు వంటి పలు రంగాల్లో తమ అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి ప్రశంసలు అందుకుంటున్నారు. పరిమిత వసతులు ఉన్నప్పటికీ, వాటిని అధిగమించి తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

హైడ్రోజన్ రాకెట్ ప్రయోగం..

పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు హర్షవర్ధన్, కౌశిక్, సుశాంత్ ఇటీవల హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో హైడ్రోజన్ రాకెట్‌ను ప్రదర్శించి అందరి దృష్టిని ఆకర్షించారు. తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను ప్రయోగించేందుకు ఉద్దేశించిన ఈ రాకెట్ డిజైన్‌ను ఇస్రో అధికారులు గుర్తించారు. యువికా(యువ విజ్ఞాని కార్యక్రమం)లో భాగంగా నిర్వహిస్తున్న అంతరిక్షంపై అవగాహన, పరిశోధనలపై 15 రోజుల శిక్షణకు వారిని ఎంపిక చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 12 మంది ఎంపిక జరిగితే, అందులో ముగ్గురు లచ్చపేట ఆదర్శ పాఠశాల నుంచే ఎంపిక కావడం విశేషం. గత మే 16నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని అంతరిక్ష విభాగం పరిశోధనా కేంద్రంలో శిక్షణ పొందారు.



హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో హైడ్రోజన్ రాకెట్ ప్రయోగంపై బహుమతి పొందుతున్న లచ్చపేట విద్యార్థులు

వ్యర్థాల నుంచి సంపద సృష్టి, క్రీడల్లోనూ విజయాలు

విద్యార్థులు వ్యర్థాల నుంచి సంపదను సృష్టించే లక్ష్యంతో వినూత్న ప్రయోగాలు చేపట్టారు. చెక్కపొట్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయడం, భవనంపై పడిన నీటిని ఉపయోగించి విద్యుత్ తయారు చేయడం వంటి ప్రాజెక్టులతో రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శన ఇచ్చి అందరినీ ఆకర్షించారు. క్రీడా రంగంలోనూ లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల తుక్కుగూడలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్, యోగా, కబడ్డీ పోటీలలో విద్యార్థులు విజయం సాధించారు. యోగాలో ఇద్దరు, కబడ్డీలో నలుగురు రాణించారు. కరాటేలో ఒక విద్యార్థి బంగారు పతకం సాధించగా, ఏడుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌లో ఎంపికై ఉపకారవేతనాలు పొందుతున్నారు.



రాష్ట్రపతి భవన్‌లో వ్యర్థాలతో సంపదను, విద్యుత్‌ను తయారు చేయడంపై ప్రయోగాత్మకంగా చూపెడుతున్న విద్యార్థులు

కళా ఉత్సవ్‌లో రాష్ట్ర స్థాయి ప్రతిభ

నల్గొండ జిల్లాలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కళా ఉత్సవ్‌లో లచ్చపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు తొమ్మిది మంది వివిధ అంశాలలో తమ సత్తా చాటారు. ఆరుగురు విద్యార్థులు జానపద బృంద నృత్యంలో, ఒకరు చిత్రలేఖనంలో బహుమతులు సాధించారు. మరో ఇద్దరు పెయింటింగ్ త్రీడీ చిత్రాల తయారీలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారు.

అద్భుతమైన ఫలితాలు

ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాలలో కూడా ఈ పాఠశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారు. ఇటీవల ఎస్సెస్సీ ఫలితాలలో అత్యధికంగా 562 మార్కులు సాధించగా, 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 32 మంది ఉన్నారు. ఇంటర్‌లోనూ 98 శాతం ఉత్తీర్ణతతో లచ్చపేట ఆదర్శ పాఠశాల గుర్తింపు పొందింది. సుమారు 500 మంది పాఠశాల విద్యార్థులు, 220 మంది కళాశాల విద్యార్థులు ఇక్కడ విద్యాబోధన సాగిస్తున్నారు.

నిర్లక్ష్యపు నీడలో చారిత్రక కట్టడాలు

● వెల్దుర్తిలో ప్రాభావం కోల్పోతున్న కాకతీయుల కట్టడాలు
● ధ్వంసమవుతున్న శిల్పసంపద
● పట్టించుకోని పురాతత్వశాఖ

వెల్దుర్తి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు సామ్రాజ్యాన్ని పాలించిన కాకతీయుల కాలం నాటి అద్భుత కట్టడాలు వెల్దుర్తి మండల కేంద్రంలో నేడు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. నాటి కాకతీయ రాజులు తమ పాలనకు గుర్తుగా అనేక ఆలయాలు, శిల్పాలు, ఇతర కట్టడాలను నిర్మించారు. వెల్దుర్తి ఆనాడు పాలనా కేంద్రంగా ఉండటంతో ఇక్కడ కూడా పలు దేవాలయాలు, నిర్మాణాలు వెలిశాయి. అయితే, నాటి నుంచి నేటి వరకు వీటిని ఎవరూ పట్టించుకోకపోవడంతో ఇవి మట్టిలో కూరుకుపోయి, శిథిలమై, చెట్ల పొదల్లో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వాలు, పాలకులు, పురావస్తు శాఖ శీతకన్ను వేయడంతో ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాచీన కట్టడాలు తమ ప్రాభవాన్ని కోల్పోతున్నాయి.





శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన విఠలేశ్వరాలయం

నేటికీ జీవం ఉట్టిపడేలా..

చారిత్రక ఆనవాళ్లు ఇలా ధ్వంసమవుతుండటంతో స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నాటి శిల్పాలు నేటికీ జీవం ఉట్టిపడేలా ఉండగా, మరికొన్ని నిర్లక్ష్యపు నీడలో కనుమరుగవుతున్నాయి. ఆదరణ కొరవడటంతో ఇవి భవిష్యత్తులో నామరూపాలు లేకుండా పోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. క్రీ.శ 1162లో కాకతీయ రుద్రదేవుడు వరంగల్ జిల్లా హన్మకొండలో వేయి స్తంభాల గుడిని నిర్మించిన సమయంలోనే వెల్దుర్తిలో కూడా ఈ కట్టడాలు నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

భూమిలో కూరుకుపోయి..

వెల్దుర్తి పట్టణంలోని అంగడి స్థలంలో శిథిలావస్థలో ఉన్న దేవాలయాలు, శిలాశాసనాలు, విగ్రహాలు చెల్లాచెదురుగా భూమిలో కూరుకుపోయాయి. ఆలయ ప్రాంగణంలో ఒకవైపు శివాలయం, మరోవైపు వైష్ణవాలయం, వాటికి ఎదురుగా ఎత్తైన సింహద్వారం, గరుడ స్తంభాలు ఉన్నాయి. అర్ధచంద్రాకారంలో చెక్కిన శ్రీమన్నారాయణ స్వామి, కాళీమాత, విఘ్నేశ్వరుడు, నంది విగ్రహాలు ఆలనాపాలనా లేక ఆరుబయట పడి ఉన్నాయి. ఎనిమిది అడుగుల కాళీమాత విగ్రహం ధ్వంసమై చెట్ల పొదల్లో ఉండిపోయింది. ఈ కట్టడాలు 800 ఏళ్ల క్రితం నిర్మించినట్లు తెలుస్తోంది. అలాగే, విఠలేశ్వరాలయం పక్కన గణపతి, నంది, శివలింగ విగ్రహాలు కూడా ఆరుబయట ఉన్నాయి. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ కట్టడాలు, ఆలయాలు నిరాదరణకు గురవుతున్నాయి.

వెలుతురు నుంచి వెల్దుర్తిగా...

మండల కేంద్రమైన వెల్దుర్తిలో వారాంతపు సంత జరిగే ప్రదేశంలో తూర్పు దిశగా 20 అడుగుల ఎత్తైన సింహద్వారం ఉంది. ఈ ద్వారానికి ఆరు రంధ్రాలున్నాయి. ఒక్కో రుతువులో ఒక్కో రంధ్రం నుంచి సూర్యకిరణాలు సింహద్వారం ఎదురుగా ఉన్న వైష్ణవాలయంలోని శ్రీమహావిష్ణువు నాభిపై పడి తిరిగి లోకానికి వెలుగును ఇస్తాయని ఇక్కడి వారి విశ్వాసం. అందుకే వెలుతరు అనే పేరు వచ్చిందని, కాలక్రమేణా వెలుతురు అనే పదం వెల్దుర్తిగా మారిందని గ్రామస్థులు చెబుతున్నారు.

కుడి చెరువు పేరు ఎలా వచ్చిందంటే..

వెల్దుర్తిలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన విఠలేశ్వరాలయం కూడా ఉంది. దీని పరిసరాల్లో నటరాజు, నంది, గణపతి తదితర విగ్రహాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. సింహద్వారం, దీప స్తంభాలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ దేవాలయానికి దగ్గరలోనే కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన చెరువు ఉంది. దీనిని అప్పట్లో గుడికుంటగా పిలిచేవారని, ప్రజలు తాగునీటిని సైతం ఇక్కడి నుంచే తెచ్చుకునేవారని చెబుతారు. కాలక్రమేణా ఇది కుడి చెరువుగా పిలువబడుతోంది. ప్రస్తుతం ఈ చెరువు ఆయకట్టు 250 ఎకరాల వరకు ఉంది.



కాకతీయ తోరణం (సింహద్వారం)

ప్రభుత్వం, అధికారులు స్పందించాలి

శిథిలావస్థలో ఉన్న ఈ చారిత్రక కట్టడాలు, ఆలయాల పునరుద్ధరణ కోసం ప్రభుత్వం, పురావస్తు శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంతో ఘన చరిత్ర కలిగిన మన వారసత్వ సంపదను కాపాడాలని, వాటి సంరక్షణకు ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





ధ్వంసమైన కాళిమాత, నంది లింగం విగ్రహాలు

గృహ కార్మికులు సంఘటితమై

నేడు అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం

● యూనియన్ ఏర్పాటు చేసిన మెడ్వాన్ సంస్థ
● హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి కృషి
● సంగారెడ్డి జిల్లాలో 58 వేల మంది

సంగారెడ్డి రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో పనిచేస్తూ అవమానాలు, అనచివేతలకు గురవుతున్న గృహ కార్మికులకు మెడ్వాన్ సంస్థ అండగా నిలుస్తోంది. పరిశ్రమల్లో, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే వారికి ఉన్నట్లే గృహ కార్మికులకూ ట్రేడ్ యూనియన్ ఏర్పాటు చేసి, వెయ్యి మందికి పైగా సభ్యత్వం కల్పించింది మెడ్వాన్. ఈ యూనియన్‌లో ఉన్న సభ్యులకు ఏ సమస్య వచ్చినా మెడ్వాన్ అండగా ఉంటోంది. అంతేకాకుండా, గృహ కార్మికుల పిల్లలను బడిలో చేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నది. గృహ కార్మికులు, ఇంటి యజమానులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నది.



వెట్టి చాకిరీతో దుర్భర జీవితం

తమ కుటుంబాలను పోషించుకునేందుకు గృహ కార్మికులు సంవత్సరాల తరబడి వెట్టిచాకిరి చేస్తున్నా సరైన ఫలితం దక్కడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్లలో పనులు చేస్తున్నప్పటికీ సరిపోను డబ్బులు ఇవ్వడం లేదనే ఆరోపణలున్నాయి. పరిశ్రమల్లో 8 గంటలు పని చేసే వారికి రూ. 12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనాలు వస్తుండగా, తాము ఇళ్లలో సెలవులు లేకుండా నెల రోజుల పాటు నిర్విరామంగా పనిచేస్తున్నామని సరిపోను డబ్బులు చెల్లించడం లేదని వాపోతున్నారు. లైంగిక వేధింపులు, దొంగతనాల నిందలు వేసి భౌతిక దాడులకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. కానీ మెడ్వాన్ గృహ కార్మికుల సంఘం ఏర్పాటు చేసినప్పటి నుంచి తమ సమస్యలకు చెక్ పడిందంటున్నారు. తమ హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడుతున్నామన్నారు. దీంతో ఇంటి యజమానులు తమతో మర్యాదగా నడుచుకుంటున్నారని చెబుతున్నారు. కాగా, సంగారెడ్డి జిల్లాలో సుమారు 58 వేల మంది గృహ కార్మికులు ఉన్నారు.

వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి



పని ఎక్కువవుతున్నా చాలీచాలని వేతనాలే ఇస్తున్నారు. పనికి తగ్గట్టు వేతనాలు ఇచ్చి ఆదుకోవాలి. సంఘం ఏర్పాటైన తర్వాత తమను గౌరవంగా పిలుస్తున్నారు.ఏమైనా సమస్యలుంటే మెడ్వాన్ కార్యాలయంలో సమావేశం పెట్టి పరిష్కరిస్తున్నారు. తెలిపారు.

-సునీత, నారాయణరెడ్డి కాలనీ, సంగారెడ్డి

మమ్మల్ని కార్మికులుగా గుర్తించాలి



ఇళ్లలో పనిచేసే తమను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలి. ఇందిరమ్మ ఇళ్లు, మహిళా శక్తి పథకం తమకూ వర్తింపజేయాలి. గతంలో చద్దన్నం పెట్టినా, వంద రూపాయలు ఇచ్చినా ఇంటి పని మొత్తం చేసేవాళ్లం, అమార్యదగా మాట్లడేవారు. యూనియన్‌లో చేరిన తర్వాత జీతం ఇవ్వడమే కాకుండా, తమతో మంచిగా మాట్లాడుతున్నారు.

- నర్సమ్మ, విద్యానగర్ కాలనీ, సంగారెడ్డి

గృహ కార్మికుల్లో మార్పు వస్తుంది



ఇళ్లలో పనిచేసే గృహ కార్మికుల్లో మార్పు వస్తుంది. వారి సమస్యలను తోటి కార్మికులు పరిష్కరించుకునేలా అవగాహన, చైతన్య సదస్సులు నిర్వహించి మార్పు తీసుకువస్తున్నాం. కార్మికుల పిల్లలు బాల కార్మికులుగా మారకుండా మెరుగైన విద్యనందించేలా ప్రోత్సహిస్తున్నాం. యజమానులు వారిని చిన్న చూపు చూడకుండా మనుషులుగా గుర్తించాలని అవగాహన కల్పిస్తున్నాం.

- మధుసూదన్‌రెడ్డి, మెడ్వాన్ డైరెక్టర్

కోలుకుంటున్నా.. ఆందోళనపడొద్దు

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



చేర్యాల, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజల దీవెనలు, ప్రార్థనలు, ఆశీర్వాదాలతో త్వరగా కోలుకుంటున్నానని, ఎవరూ ఆందోళన పడొద్దని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌లో కింద పడి గాయాలపాలైన ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యేను కలవడానికి పార్టీ శ్రేణులు, అభిమానులు ఆస్పత్రికి వెళ్తున్నా.. కలవలేని పరిస్థితి ఉండటంతో ఆదివారం ఓ వీడియో ద్వారా ఆయన సందేశాన్ని పోస్ట్ చేశారు. కాలికి మేజర్ ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నట్లు తెలిపారు. వైద్యుల సలహా మేరకు ఎవరినీ కలవలేకపోతుండటం విచారంగా ఉందన్నారు. వారం రోజుల్లో మీ అందరినీ కలిసి కష్టసుఖాల్లో పంచుకుంటానని పేర్కొన్నారు.

వర్షమొస్తే రాకపోకలు బంద్

● దశాబ్దాలుగా ఆగిన కల్వర్టు పనులు ● పూర్తిచేయాలని ప్రజల వేడుకోలు



నారాయణఖేడ్-ఖాంజీపూర్ గ్రామాల మధ్య ఆగిపోయిన కల్వర్టు నిర్మాణ పనులు

నారాయణఖేడ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖాంజీపూర్, సమీపంలో వాగుపై వంతెన నిర్మాణానికి రెండు దశాబ్దాల క్రితం రూ.4 లక్షలు మంజూరు చేశారు. ఈ పనులను దివంగత కిష్టారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పనులు ప్రారంభించారు. వంతెన పనులు జరుగుతున్న సమయంలో వరదలు రావడంతో పాటు నిధులు సరిపోక పనులు ఆగిపోయాయి. అయితే ఖాంజీపూర్ నుంచి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలతో పాటు సరిహద్దుల్లో ఉన్న పిట్లం పట్టణానికి, కంగ్టి, కల్హేర్, సిర్గాపూర్ మండలాలకు వెళ్లడానికి దూర భారం తగ్గుతుందని అసంపూర్తిగా ఉన్న కల్వర్టు పైపులపై మొరం వేయించడంతో రాకపోకలు సాగుతున్నాయి. అలాగే సంజీవన్‌రావుపేట్, నాగ్‌ధర్ తదితర గ్రామాల ప్రజలు కూడా ఈ రోడ్డు గుండానే ఖేడ్‌కు వస్తుంటారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఈ కల్వర్టు పైనుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో గ్రామానికి వెళ్లాలంటే చుట్టూ తిరగాల్సి వస్తుందని తండావాసులు అంటున్నారు. ప్రస్తుతం కల్వర్టుకు పైపులు తేలడంతో పాటు ఇరువైపులా సేఫ్టీ వాల్ లేకపోవడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా ఉన్న వంతెన పనులు పూర్తి చేసేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మూడేళ్లుగా ఆగుతూ.. సాగుతూ..

● నత్తనడకన రోడ్డు పనులు ● 3 కిలోమీటర్ల కోసం.. 10 కిలోమీటర్లు ప్రయాణం



కొత్తూర్(బి)-బూచనెల్లి గ్రామాల మధ్య కంకరతేలి అధ్వానంగా మారిన రోడ్డు

జహీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూర్(బి)-బూచనెల్లి గ్రామాల మధ్య గల రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారింది. దూరం తగ్గించేందుకు మూడేళ్ల క్రితం గ్రామీణ రోడ్ల అనుసంధానంలో భాగంగా ఒకటిన్నర కిలోమీటరు దూరం కంకర తేలిన రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు రూ.2 కోట్లను మంజూరు చేశారు. అయితే ఆ పనులు మూడేళ్లుగా ఆగుతూ..సాగుతున్నాయి. ఇదిలా ఉండగా ఆయా గ్రామాల ప్రజలు వారి గ్రామాలకు వెళ్లాలంటే తూంకుంట చౌరస్తా, 65వ నంబరు జాతీయ రహదారి మీదుగా 10 కిలోమీటర్లు దాటి వెళ్లాల్సి వస్తుంది. ఈ రోడ్డును బాగుచేస్తే కేవలం మూడు కిలోమీటర్ల దూరమే అవుతుందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డును బాగు చేయాలని అధికారులకు, నాయకులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ డీఈఈ రాంచందర్‌ను వివరణ కోరగా.. కాంట్రాక్టర్ వివిధ కారణాలతో చేయలేకపోయాడని, త్వరలో పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యూస్ బాక్స్

ఎంపీని కలిసిన నాయకులు



ఎంపీతో బీజేపీ మండల నాయకులు

మనోహరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మెదక్ ఎంపీ రఘునందన్‌రావును బీజేపీ రాష్ట్ర నాయకుడు కుమ్మరి నాగరాజు జన్మదినం సందర్భంగా మండల నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజును సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్‌ముదిరాజ్ ఉన్నారు.

తూప్రాన్ పట్టణంలో ఇంటింటా బడిబాట

తూప్రాన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తూప్రాన్ ప్రభుత్వం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, మౌలిక వసతులు చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు.

రైతుభరోసాకు దరఖాస్తుల ఆహ్వానం

కంది, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : వానాలం సీజన్ రైతుభరోసాకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కంది మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 384 మంది రైతులు రైతుభరోసాకు అర్హులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. అర్హులైన రైతులందరూ సాగు భూమి పట్టా పాస్ బుక్ జీరాక్స్ లేదా తహసీల్దార్ డిజిటల్ సంతకం ఉన్న పేపర్ జీరాక్స్, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ నంబరుతో పాటు రైతుభరోసా దరఖాస్తు ఫారం ఏఈవో (వ్యవసాయ విస్తరణ అధికారి)లకు అందజేయాలని సూచించారు. రైతులు తమ బ్యాంకు అకౌంట్ నంబరును మార్చుకోవాలంటే ఈ నెల 20వ తేదీవరకు అవకాశం ఉందని తెలిపారు.

కాంగ్రెస్ యూత్ కమిటీ నియామకం

చిన్నశంకరంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలంలోని దర్పల్లి గ్రామ యూత్ కమిటీని ఆదివారం నియమించారు. అధ్యక్షుడిగా వడ్ల మహేష్, ఉపాధ్యక్షుడిగా సాయిజగన్, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, సోషల్ మీడియా కన్వీనర్‌గా నరేష్, పలువురువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేయాలి

● శానిటేషన్ అధికారి శ్రీనివాస్

నారాయణఖేడ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : గృహాల్లో తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త తరలింపు ఆటోల్లో వేయాలని మున్సిపల్ శానిటేషన్ అధికారి శ్రీనివాస్ సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆదివారం 5వ వార్డుల్లో తడి, పొడి చెత్తలపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. తడి చెత్త ఏది, పొడి చెత్త ఏదనే విషయాలను వివరించారు. పలు వార్డుల్లో పారిశుధ్య పనులు కొనసాగించారు.

22 నుంచి షిరిడీ సాయిబాబా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

నారాయణఖేడ్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో 22న ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుప్రభాత సేవ, కాకడహారతి, సామూహిక అభిషేకాలు, మహాహారతి, మూలమంత్ర వస్త్రం, హవనములు, చెప్పన్‌భోగ్, మహానైవేద్యం, మహాత్ముల ధార్మిక సందేశాలు, అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా నల్లపోచమ్మకు బోనాలు

మెదక్ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా కేంద్రం ఆటోనగర్‌లోని నల్లపోచమ్మకు ఆదివారం ఘనంగా బండ్లు, బోనాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు అనంతరం ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం డప్పుచప్పుళ్లు, బ్యాండు మేళాలతో బండ్లు, బోనాలు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు లింగారెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డిలతో పాటు నాయకులు ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్, రాగి అశోక్, వంజరి జయరాజ్, ప్రభురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సదుపాయాల కల్పనకు కృషి : ఎమ్మెల్యే



వేంకటేశ్వర ఆలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం టౌన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్ పురపాలక పరిధి పోచారం గ్రామం మహిధర లగ్జూరియా కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. కాలనీకి మిషన్ భగీరథ తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కాలనీకి దగ్గరలో ఉన్న డంపింగ్‌యార్డు తరలించేందుకు అధికారులతో మాట్లాడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో మహీధర ప్రాజెక్టు సీఎండీ ప్రశాంతరెడ్డి, మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఎంపీటీసీ భిక్షపతి, ఎమ్మెల్యే సతీమణియాదమ్మ, స్వాతి, రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహాల బిల్లులపై అపోహలు వద్దు

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఇందిరమ్మ గృహాల మంజూరుపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ గృహాల బిల్లులపై అపోహలు వద్దని, ఇందిరమ్మ గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులందరికీ తప్పనిసరిగా బిల్లులు వస్తాయని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలో బాయికాడి పద్మయ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలోని 473 మందికి మంజూరైన ఇందిరమ్మ గృహాల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. గత ప్రభుత్వం అన్నిరంగాల్లో అప్పులను మిగిల్చిందని పేర్కొన్నారు. 60 గజాలలోపు ఇందిరమ్మ గృహాలు కట్టుకోవాలని, తప్పనిసరిగా వారికి బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షాకీర్‌అలీ, హైసింగ్ డీఈ యాదగిరి, పేట ఈవో వెంకటరాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాయిని మధు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి

● జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్యాల దృష్ట్యా ప్రభుత్వం అమలుచేస్తున్న సీఎం సహాయనిధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రంజోల్ చంద్రకళకు రూ.52 వేలు, నాగమ్మకు రూ.24 వేలు, డివిడ్‌రాజ్‌కు రూ.33 వేలు, పట్టణంలోని దత్తగిరి కాలనీకి చెందిన సల్మాపర్వీన్‌కు రూ.60 వేలు, రమాకాంత్‌కు రూ.54 వేలు, బాగారెడ్డిపల్లికి చెందిన మొగులయ్యకు రూ.15 వేలు, చిన్నహైదరాబాద్‌కు చెందిన శ్యాంకు రూ.60వేల చొప్పున సీఎం సహాయనిధి చెక్కులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు విఘాతం కలిగిస్తున్న మోదీ

● కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

సంగారెడ్డి రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మోదీ విధానాలతో దేశ సమైక్యతకు విఘాతం కలిగిస్తున్నాయని కులవివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ పరిరక్షణకు అట్టడుగు వర్గాలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించి ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు అంబేడ్కర్ అభయ హస్తం ప్రకటించినా నేటికి అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నదని, ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, జిల్లా నాయకులు అశోక్, శివకుమార్, సుభాష్, నర్సింలు, మల్లేశ్, గణపతి, రాజు దాస్ పాల్గొన్నారు.

అమ్మవారి కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



అంబాజీపేటలో బోనం ఎత్తుకున్న పద్మారెడ్డి

చిన్నశంకరంపేట, జూన్ (ఆంధ్రజ్యోతి) : అమ్మవారి కృపతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట, వెంకట్రావుపల్లి, రుద్రారం గ్రామాల్లోని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పాల్గొని అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. మహిళలతో కలిసి బోనం ఎత్తుకున్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్ : డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ సైదానాయక్

జహీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదువుకుని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ సైదానాయక్ పేర్కొన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికిగాను మండలంలోని బూచనెల్లి, రంజోల్ గురుకుల పాఠశాలలకు చెందిన నందిని(600-574), సంధ్యారాణి(600-572)లు 10వ తరగతి విద్యార్థులు టాపర్లుగా నిలిచారు. వారికి ఆదివారం పట్టణంలో ఓ ప్రైవేట్ సంస్థ వారు బహుమతులు ప్రదానం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో టీబీస్ నాయకులు తులసీరాంరాథోడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు



నస్తీపూర్‌లో ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హత్నూర, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. హత్నూర మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామంలో నిరుపేదలకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కరించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కర్రె కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి హకీమ్, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కొన్యాల వెంకటేశం, వరిగుంతం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల సహకారం



శిశుమందిర్‌కు సహకారం అందించిన పూర్వ విద్యార్థులు

సంగారెడ్డి రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణంలోని ప్రశాంత్‌నగర్ కాలనీలో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల పూర్వ విద్యార్థులు వినూత్న ఆలోచనతో తీర్చిదిద్దారు. పాఠశాల 2000-2001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో వినూత్నంగా ఆలోచించి ప్రైవేటు స్కూళ్లకు దీటుగా రూ. 2 లక్షలతో తరగతి గదులను ప్లే స్కూల్ మెటీరియల్, ఫ్లోర్ మ్యాట్ వేయించి ఆధునీకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యుల బృందం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం జిన్నారంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి రూ.లక్షా ఒక్క వెయ్యి విరాళాన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన బాల్‌రెడ్డిని మాజీ సర్పంచ్ వెంకటేశంగౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, లింగం, బ్రహ్మేందర్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, అంజిరెడ్డి, నర్సింగరావు, రాము, నిఖిల్‌గౌడ్ సన్మానించారు.

ఫీ'జులుం'

5వ పేజీ తరువాయి

ఉద్యోగాలు చేసుకునేవారు, కార్మికులు సైతం అప్పులు చేసి మరీ పిల్లలను చదివిస్తున్న పరిస్థితి నెలకొన్నది.

వసతులు అంతంతే.. నియంత్రణ కొరవడింది

మెదక్ జిల్లాలోని అనేక ప్రైవేటు పాఠశాలల్లో కనీస వసతులు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయి. కొందరు ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకొని ఇరుకు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఫైర్ సేఫ్టీ, ప్లే గ్రౌండ్లు వంటి కనీస సౌకర్యాలు లేకపోయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. తల్లిదండ్రుల ఆవేదనను తగ్గించేందుకు, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



అధిక ఫీజుల వసూళ్లపై ఫిర్యాదులు వస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల మేరకే ఫీజులు వసూలు చేయాలి. ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలకు కూడా నిబంధనలు తెలియజేస్తాం.

- రాధాకిషన్, డీఈవో, మెదక్ జిల్లా

'డబుల్' గతేంటి?

5వ పేజీ తరువాయి

మోకాలి లోతు నీళ్లలో నడవాల్సి వస్తోంది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు అద్దె ఇళ్లలోనే నివసిస్తున్నారు.

● చేతులు మారుతున్న వైనం: పట్టణాలకు దూరంగా ఉండటంతో పనులు చేసుకునే కార్మికులకు రాకపోకలు కష్టంగా మారాయి. దీనితో పాటు ఇతర అవసరాల నిమిత్తం లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్లను విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఇటీవల ఈ ఇళ్లలో ఉంటున్న వారి వివరాలను సేకరిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టి, వందల కోట్లు వెచ్చించి నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను నిరుపయోగంగా వదిలేయడంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. కొత్త పథకాలను ప్రారంభిస్తూనే, పాత పథకాలలోని లోపాలను సరిదిద్ది, అర్హులకు న్యాయం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

నిరుపేదలకు కేటాయిస్తాం



నివాస స్థలం లేని అత్యంత నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రాధాన్యత కల్పిస్తూ కేటాయిస్తాం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, కేటాయించని ఇళ్ల వివరాలను పంచాయతీరాజ్ ఇంజనీర్ల నుంచి సేకరిస్తున్నాం. మరో రెండు నెలల్లో లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో ఇళ్లను అందజేస్తాం.

- మాణిక్యం, మెదక్ జిల్లా హౌసింగ్ కార్పొరేషన్ పీడీ

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

జహీరాబాద్/నిజాంపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పతంజలి యోగాసమితి నియోజకవర్గం అధ్యక్షుడు రాజేష్‌జాజు పేర్కొన్నారు. పట్టణంలోని మాణిక్‌ప్రభు మందిర్ ప్రాంతంలో ఆదివారం పతంజలి యోగాసంస్థ ఆధ్వర్యంలో యోగా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటలకు యోగా తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగాసభ్యులు, నారాయణరెడ్డి, క్రిష్ణ, రమేష్, బరూర్ దత్తాత్రి, చక్రధర్, వెంకటరెడ్డి, మల్లికార్జున్, మధుసూదన్ పాల్గొన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యమని శిక్షకుడు మద్దెల భరత్ అన్నారు. నిజాంపేట మండల కేంద్రంలో ఆదివారం ఆరోగ్యమే మహాభాగ్యం ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ ఇచ్చారు.

జోగిపేట పోస్టాఫీస్‌కు నూతన భవనాన్ని నిర్మించండి

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి జోగినాథ్‌గుప్తా వినతి

జోగిపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : జోగిపేట పట్టణంలోని పోస్టాఫీస్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరినట్టు జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, రైల్వే సాధన సమితి కన్వీనర్ గంగా జోగినాథ్‌గుప్తా తెలిపారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని కార్యాలయంలో కిషన్‌రెడ్డిని కలిసి, వినతిపత్రం సమర్పించానన్నారు. 80 ఏళ్ళుగా అందోలు-జోగిపేట, పరిసర ప్రాంతాల ప్రజలకు సేవలందిస్తున్న ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని, నూతన భవనానికి నిధులు మంజూరు చేయించమని కోరానని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి, సంబంధిత కేంద్రమంత్రికి సిఫారసు చేస్తానని హామీఇచ్చినట్లు పేర్కొన్నారు.

మల్కాపూర్‌లో గ్రామ దేవతల జాతర

తూప్రాన్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో గ్రామదేవతల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం నుంచి 18 వరకు గ్రామదేవతల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం బొడ్రాయికి జలాభిషేకం, మధ్యాహ్నం నుంచి ముత్యాలమ్మ, రేణుకాఎల్లమ్మ, నల్ల పోచమ్మ, కనకదుర్గమ్మలకు బోనాలు సమర్పించే కార్యక్రమం చేపట్టారు. శివసత్తుల పూనకాలతో పోతరాజుల గావు రంగాలతో మల్కాపూర్ మారుమోగింది. బోనాల ఊరేగింపులో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. సోమవారం ఊరడమ్మ, మంగళవారం మహంకాళీమాత పండుగలతో జాతర బుధవారం ముగుస్తుందని గ్రామస్థులు వివరించారు.

'నిధులు మంజూరు చేయకుంటే సామూహిక సెలవులు పెడతాం'

అల్లాదుర్గం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీకి ప్రభుత్వం మంజూరు చేయాల్సిన నిధుల జాప్యంతో కార్యదర్శులు సామూహిక సెలవులు పెట్టేందుకు జేఏసీ పిలుపుమేరకు సిద్ధమవుతున్నారని అల్లాదుర్గం మండల గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు లింగప్ప, గణేష్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 17 నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని, ఈ గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినా ఆ అధికారులకు ఇతరత్రా పనులు ఉండడంతో గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత కార్యదర్శులపై పడిందన్నారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం కార్యదర్శులు రూ.3 నుంచి రూ.10 లక్షల వరకు అప్పులు చేయాల్సి వచ్చిందని, ఈ విషయమై జేఏసీ నాయకులు మంత్రి సీతక్కకు కూడా విన్నవించడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు



ముప్పారంలోని ముప్పదేవుని చెరువులో మట్టిని అక్రమంగా తవ్వుతున్న దృశ్యం

అల్లాదుర్గం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాలకు సెలువులు వచ్చాయంటే చాలు మట్టి మాఫియా చెలరేగిపోతోంది. రాజకీయ పలుకుబడితో చెరువుల్లోని మట్టిని ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన గ్రామస్థులు మట్టి తవ్వకాన్ని ఆదివారం అడ్డుకున్నారు. ముప్పారం గ్రామంలోని ముప్పదేవుని చెరువు గృహాల పరిసరాల్లో ఉంది. ఈ చెరువులో ఓ వ్యాపారి అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతుండడంతో గ్రామస్థులు అడ్డుకునేందుకు యత్నించారు. అయినా పట్టించుకోకపోవడంతో తహసీల్దార్ మల్లయ్యకు ఫోన్‌లో ఫిర్యాదు చేయగా.. మట్టి తవ్వకాలను నిలిపేయించారు. ఇదిలా ఉండగా మండలంలోని గడిపెద్దాపూర్ పటన్‌చెరువులోను, గోరుట్టపై సెలవురోజుల్లో జోరుగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మట్టి తవ్వకాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.